రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- మాధవరం– నేలమర్రి రోడ్డు గుంతలమయం
- ఇరుకుగా మారిన రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- డబుల్ రోడ్డుగా మార్చాలని వేడుకోలు



అధ్వానంగా ఉన్న నేలమర్రి రహదారి

మునగాల : మండలంలోని మాధవరం నుంచి నేలమర్రి గ్రామాల మధ్య 8 కిలోమీటర్లు గల ఆర్ అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. రహదారిపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. కంకరతేలి రోడ్డు అధ్వానంగా తయారైంది. అంతే కాకుండా ఇరువైపులా మార్జిన్ ఆక్రమణలకు గురైంది. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై కంకర మిల్లు, ఇటుక బట్టీలకు చెందిన ట్రాక్టర్లు, టిప్పర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల బారిన పడి పలువురు గాయాలపాలవ్వడమే కాక మృత్యువాత పడుతున్నారు. ఇక ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరి దారుణంగా ఉంది. నేలమర్రి నుంచి జాతీయ రహదారిపై ఉన్న మాధవరం గ్రామానికి చేరుకోవాలంటే గుంతల రోడ్డుపై ద్విచక్ర వాహనదారులకు గంట సమయం పడుతోంది. ఈ రహదారి గుండా మరో నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకుంటారు. కావున ఈ రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చాలని నేలమర్రి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

డబుల్ రోడ్డు మంజూరు చేయాలి



నేలమర్రి నుంచి మాధవరం గ్రామానికి చేరుకోవాలంటే మేము నిత్యం నానా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై మోకాళ్ల లోతు గుంతలు ఉన్నాయి. దీంతో రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున నేలమర్రికి డబుల్ రోడ్డు మంజూరు చేసి నిర్మించాలి.

– రాంపంగు వెంకటేశ్వర్లు, నేలమర్రి

క్లుప్తంగా

నడిగూడెం ఎంపీడీఓగా సంజీవయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సంజీవయ్య

నడిగూడెం : నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా దాసరి సంజీవయ్య శుక్రవారం విధుల్లో చేరారు. పెన్‌పహాడ్ ఎంపీఓగా పని చేసిన ఆయన ఎంపీడీఓగా పదోన్నతి పొంది నడిగూడెంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

లింగమంతులస్వామి జాతరకు సైదిరెడ్డికి ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరంలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించబోయే శ్రీలింగమంతుల స్వామి జాతరకు రావాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శానంపూడి సైదిరెడ్డిని ఆలయ చైర్మన్ మద్దుల కృష్ణయాదవ్, బీజేపీ హుజూర్‌నగర్ మండల అధ్యక్షుడు నారపరెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ పిన్నబోయిన రమేష్‌యాదవ్, లకుంట్ల నాగరాజు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం కోదాడ కేఆర్‌ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుడుగుంట్ల విద్యాసాగర్ –లక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధుల, అనాథల మధ్య నిరాడంబరంగా వివాహ వార్షికోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు చింత వెంకన్న, గుండా అశోక్, సాంబమూర్తి, అక్కినేపల్లి సత్యనారాయణ, ఆరె.రామకృష్ణారెడ్డి, కొక్కుల రామమోహన్‌రావు, బ్రహ్మయ్య, యం.లక్ష్మయ్య, పిచ్చమ్మ, ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి

నేరేడుచర్ల : మండలంలోని దాచారం గ్రామంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు మూడు నెలల పాటు కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు యడవెల్లి సత్యనారాయణరెడ్డి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, ఉప్పాల లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి మండలంలో ఎంపీటీసీ స్థానాలు పెంచాలి

గరిడేపల్లి : గరిడేపల్లి మండలంలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య పెంచాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో మండల కేంద్రమైన గరిడేపల్లిలో ఎంపీటీసీ –1, ఎంపీటీసీ– 2 ఉన్నాయని తెలిపారు. ఎంపీటీసీ –2 పరిధిలో గరిడేపల్లి, పరెడ్డిగూడెం, వెంకటారంపురం, గారకుంటతండా గ్రామాలు ఉన్నాయని, నాలుగు గ్రామ పంచాయతీల్లో 4880 ఓట్లు ఉన్నాయని తెలిపారు. వెంకట్రాపురం, పరెడ్డిగూడెం, గారకుంటతండా గ్రామ పంచాయతీల్లో 2500పైగా ఓట్లు ఉన్నాయని, కొత్త ఎంపీటీసీ స్థానానికి అవసరమైన ఓట్లు సంఖ్య కూడా ఉందని, కావున ప్రత్యేక ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మహిళకు రక్తదానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహిళ స్వాతికి అవసరమైన బి పాజిటివ్ రక్తాన్ని దాత కుడితొట్టి జగదీష్ శుక్రవారం అందజేశారు. దీంతో అతనిని పలువురు అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

గరిడేపల్లి : శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. సీసీ కెమెరాల అవశ్యకతపై ప్రజలకు, వ్యాపారులకు పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేష్, ఏఎస్‌ఐ రాములు, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కనకదుర్గమ్మ జాతర



చిలుకూరు : కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో శుక్రవారం కనకదుర్గమ్మ జాతరను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులు గురువారం సాయంత్రం ప్రభబండ్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయం ఆవరణలో ప్రభలను ఉంచి వెళ్లి, శుక్రవారం సాయంత్రం తిరిగి ఇళ్లకు తీసుకెళ్లారు. శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిలుకూరు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జెర్రిపోతులగూడెంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండు నర్సయ్య గౌడ్, కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



పౌరాణిక నాటక ప్రదర్శనలో కళాకారులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గుట్టుపై వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి చక్రస్నాన ఘట్టం పూర్తిచేశారు. తదుపరి చక్ర పెరుమాళ్ల ఉత్సవమూర్తులను పల్లకీలో పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. సాయంత్రం సదస్యం, నిత్య హోమం, పూర్ణాహుతి వంటి వైదిక క్రతువులను నిర్వహించారు. ధ్వజస్తంభానికి అలంకరించిన ధ్వజపటాన్ని అవరోహణ చేశారు. కాగా, గుట్టుమీద కళావేదికపై సప్తస్వర శ్రీనివాస భజన మండలి వారు పాడిన పాటలు, కీర్తనలు, పద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వికాస తరంగిణి మహిళలు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం మంత్ర ముగ్ధులను చేసింది. రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పౌరాణిక ప్రదర్శనలు, బాల బాలికలతో ప్రదర్శించిన నృత్యం సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ, యాజ్ఞికులు, అర్చకులు, స్థానాచార్యులు, ఆలయ సిబ్బంది, మహిళలు, కళాకారులు, ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనాన్ని పునర్నిర్మించాలి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న సామాజిక వేత్త క్రాంతికుమార్

నేరేడుచర్ల : మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనాన్ని పునర్నిర్మించాలని సామాజిక వేత్త, పెంచికల్‌దిన్న గ్రామ మాజీ సర్పంచ్ సుంకర క్రాంతికుమార్ కోరారు. శుక్రవారం ఆయన గ్రంథాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. నేరేడుచర్లలో గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోవడం, అందులో సరైన వసతులు లేకపోవడంతో అనేక మంది పేద విద్యార్థులు హుజూర్‌నగర్, మిర్యాలగూడలోని గ్రంథాలయాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ నూతన గ్రంథాలయ భవనం నిర్మించి వసతులు కల్పిస్తే నేరేడుచర్ల, పాలకీడు మండలాలకు చెందిన నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సంసిద్ధం అయ్యేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులు, దృష్టి సారించాలని ఆయన కోరారు. ఆయన వెంట జింకల భాస్కర్, కాసాని నాగరాజు, నవీన్, మన్సూర్, వంశీ, నవ్య తదితరులు ఉన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నడిగూడెం : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం నడిగూడెంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్, తదితర పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. లేనియెడల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు కానిస్టేబుళ్లు ఉన్నారు.

సహకార సంఘాల కాలపరిమితి పెంపుపై హర్షం

గరిడేపల్లి : సహకార సంఘాల కాలపరిమితిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై రాయినిగూడెం సహకార సంఘం చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల పాటు సహకార సంఘాల పరిధిలోని రైతులకు సేవలందించేందుకు అవకాశం లభించిందని అన్నారు. సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

న్యాయమూర్తిపై దాడి అమానుషం



కోదాడలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కోదాడ : బాధితులకు న్యాయం చేయడానికి నిత్యం కృషి చేసే న్యాయమూర్తిపై దాడి చేయడం అమానుషమని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌కె మూర్తి అన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. దాడులను అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గట్ల నరసింహారావు, చింతకుంట్ల రామిరెడ్డి, కోదూరు వెంకటేశ్వరరావు, హేమలత, ధనలక్ష్మి, దొడ్డా శ్రీధర్, శరత్‌బాబు, ఎంవీఎస్ శాస్త్రి, వెంకటేశ్వర్లు, రాజన్న, మంగయ్యగౌడ్, ఉయ్యాల నర్సయ్య, అబ్దుల్ రహీమ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో దాడులను అరికట్టాలి

మునగాల : రాష్ట్రంలో న్యాయ వ్యవస్థలో కక్షిదారులు, ఫిర్యాదుదారులు, న్యాయవాదులు, జడ్జిలపై కోర్టుల ఆవరణలోనే దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి దాడులు భవిష్యత్‌లో జరగకుండా ఉండాలంటే న్యాయస్థానాల్లో సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని మునగాలకు చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ అన్నారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి శుక్రవారం ఈమెయిల్ ద్వారా లేఖ పంపినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జ్యుడిషియల్ జడ్జి కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు, జిల్లా కోర్టులలో పగలు ఒక గన్‌మెన్, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు, రాత్రి కోర్టు కాపలాకు ఒక గన్‌మెన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని సీఎంకు పంపిన మెయిల్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

పెదవీడు గ్రామస్తుల రాస్తారోకో



ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

మఠంపల్లి: మండలంలోని పెదవీడు మీదుగా ప్రధాన రహదారిపై స్థానిక సిమెంట్ పరిశ్రమకు వెళ్లే బొగ్గు లారీల కారణంగా బొగ్గుతోపాటు, దుమ్మధూళి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం రాత్రి గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బొగ్గు లోడ్ లారీలు టార్పాలిన్లు కప్పకుండా వెళ్తుండడంతో దుమ్ము ఇళ్లలోకి వస్తుందని వాపోయారు రాస్తారోకోతో ట్రాఫిక్ జామ్ కావడంతో మఠంపల్లి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఎస్‌ఐ బాబు రోడ్డుపై బొగ్గు పడకుండా పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తాడువాయిలో క్షయ నిర్ధారణ పరీక్షలు

మునగాల : మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల తాడువాయి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎడతెరిపిలేని దగ్గు, జ్వరం, ఆయాసం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాల్లో ఒకటి లేదా రెండు ఉంటే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిక్షయ శివిర్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరు నెలలు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. కాగా, ఈ వైద్య శిబిరంలో 44 మంది నుంచి తెమడ శ్యాంపిల్స్ సేకరించామని, 44 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి బి.భాస్కర్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ.డాక్టర్ వైష్ణవి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సుభాషిణి, సైదులు, ఫణీందర్, టీబీ నోడల్ పర్సన్ రామకృష్ణ, లింగయ్య, ఏఎన్‌ఎంలు సుచరిత, పావని, లలిత, మయూరి, కలమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేకల కృష్ణయ్య మృతి బాధాకరం



మేకల కృష్ణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొల్లం మల్లయ్యయాదవ్

మోతె : మేకల కృష్ణయ్య మృతి బాధాకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మోతె మండల పరిధిలోని సర్వారం గ్రామంలో మేకల కృష్ణయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేకల కృష్ణయ్య మృతి ఆయన కుటుంబానికి తీరని లోటన్నారు. అదేవిధంగా ఏలూరి వెంకటేశ్వరరావు సతీమణి కీర్తిశేషులు పార్వతి ఐదో వర్ధంతి సందర్భంగా పార్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, మిక్కిలినేని సతీష్, పల్సు మల్సూర్ పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం



వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలయ్య, ఉపాధ్యాయులు వీరయ్య, ఆంజనేయులు, యలయ్య, షబానా తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు ఘన నివాళి



మునగాలలో కొవ్వొత్తులతో వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న జనవేదిక సభ్యులు, తదితరులు

మునగాల : పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం రాత్రి మునగాలలో జనవేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనవేదిక సభ్యులు మీసేవ శర్మ, సీహెచ్.సీతారామ్, చింతకాయల ఎల్లయ్య, సిరికొండ అజయ్, పి.గణేష్, వినోద్, సాయి, కిరణ్, రాయిల కృష్ణ, పోలీసులు, యువకులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..



నేరేడుచర్లలో నివాళులర్పిస్తున్న మాతరం యూత్ సభ్యులు, గ్రామస్తులు

నేరేడుచర్ల : కాశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో ఉగ్రదాడిలో మరణించిన వీర జవాన్లకు శుక్రవారం రాత్రి నేరేడుచర్లలో మాతరం యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాతరం యూత్ అధ్యక్షులు జింకల భాస్కర్ మాట్లాడుతూ.. అమరులైన వీర జవాన్ల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంకర క్రాంతికుమార్, నాగేశ్వర్‌రావు, కొణతం లచ్చిరెడ్డి, కొణతం నాగిరెడ్డి, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, తాళ్ల నరేందర్‌రెడ్డి, నరినాయక్, రామ్మూర్తి, అంబటి నాగేశ్వర్‌రావు, నాగిరెడ్డి, కిరణ్, సతీష్, నాగయ్య, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో..



గరిడేపల్లి : కల్మలచెరువులో..

గరిడేపల్లి : పుల్వామాలో ఆరేళ్ల క్రితం జగిరిన ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం మండలంలోని కల్మలచెరువు గ్రామంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. గ్రామప్రజలు, యువకులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 47వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 24 నుంచి 28 వరకు శ్రీకాశీమహేశ్వర శ్రీగోవిందాంబ సమేత జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఇనుగుర్తి వీరాచారి తెలిపారు. శుక్రవారం ఆలయం ఆవరణలో కల్యాణ మహోత్సవాల కరపత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త ముత్యాల సత్యనారాయణ, ప్రధాన అర్చకుడు బాణాల లక్ష్మణాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు అనంతోజు సుభాష్‌చంద్రబోస్, కాశీ నాగార్జునచారి, వెలది వెంకటప్పాచారి, బంగారపు శ్రీనివాస్, ముత్యాల వెంకటేశ్వర్లు, ముత్యాల శివ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున నడిగూడెం మండల కేంద్రంలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యావ్యవస్థను కాపాడుకోవాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపాల్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి

కోదాడ: గడిచిన పది సంవత్సరాల్లో తెలంగాణలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యావంతులపై ఉందని నల్లగొండ– ఖమ్మం– వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోదాడలోని మండల సహకార కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ రాకతో నిబద్ధతతో నడిచే చిన్న ప్రైవేట్ విద్యాసంస్థలు మూత పడ్డాయని, కార్పొరేట్ శక్తులు విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో సూరం ప్రభాకర్‌రెడ్డి, పందిరి నాగిరెడ్డి, డీఎస్. స్వామి, పందిరి నాగిరెడ్డి, రాయపూడి చిన్ని, జీఎల్ఎస్.రెడ్డి, గంగాధర్, నరేష్, ఎస్ఎస్. రావు, ప్రసాద్, విజయభాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

హుజూర్‌నగర్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొన్నాల గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నీతి, నిజాయితీ బలమైన ఉద్యమ గొంతుకగా తనను గుర్తించి మొదటి ప్రాధ్యాత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో హైకోర్టు న్యాయవాది సూరం ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ మేరెడ్డి ఎల్లారెడ్డి, పాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం పోరాడిన నాయకుడు రాములు



రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : వ్యవసాయ కార్మికుల కూలి రేట్ల పెంపు కోసం పోరాడిన వ్యక్తి, సీపీఎం నాయకుడు బత్తిని రాములు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగరపు పాండు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో రాములు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి, నాయకులు దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, పి.హుస్సేన్, నవీన్, వెంకటనారాయణ, వీరయ్య, యోన, వీరమల్లు, వెంకటేశ్వర్లు, వీరస్వామి, నరసయ్య, సోమయ్య, నరసింహాచారి, అక్కమ్మ, సుభద్ర, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.